పెండింగ్ ఈ-చలానాలు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలు చెల్లించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. బుధవారం తెలిపారు. రాష్ట్రంలో మోటారు వాహనాల చట్టం అమలుపై సుప్రీంకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యంపై సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను ఈనెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని కోర్టు ఆవరణల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వాహనదారులు వారి వాహనాలపై ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు సంబంధించి ఉన్న ఇ-చలానాలను చెల్లించి పరిష్కరించుకోవాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌కు ట్రాఫిక్ పోలీసు అధికారులు హాజరు కావాలన్నారు.

తప్పు ఒకరిది.. శిక్ష మరొకరికా?

- భూ సమగ్ర సర్వే సమయంలో ఇష్టానుసారంగా మార్పులు
- సరిదిద్దుకోలేని తప్పిదాలతో చుక్కలు చూస్తున్న రైతులు
- రెవెన్యూ పాపాలను కొనసాగిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం
- భూ సమస్యల పరిష్కారంపై చర్యలు శూన్యం

ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడు పేటలో సర్వే చేస్తున్న సిబ్బంది

తప్పు ఒకరు చేస్తే, శిక్ష మరొకరికి అన్నట్టుగా ఉంది జిల్లాలోని రెవెన్యూ శాఖ పరిస్థితి. ఆ శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన పాపానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ సమగ్ర సర్వే సమయంలో విఆర్‌ఒలు, సర్వేలు ఇష్టానుసారంగా రికార్డులను మార్చేశారన్న విమర్శలు గతంలోనే వినిపించాయి. గత ప్రభుత్వం తగినంత సమయం ఇవ్వకపోవడం, ఒత్తిళ్లు, టెక్నికల్ సమస్యల వల్లే వెబ్‌ల్యాండ్‌లో తప్పిదాలు జరిగాయంటూ అధికారులు సాకులు చెప్తున్నా... భూస్వాములు, ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్న నాయకులు చివరకు రెవెన్యూ సిబ్బందికి చెందిన వారి భూముల్లో ఎక్కడా తప్పిదాలు జరిగిన దాఖలాల్లేవు. సామాన్య, నిరుపేద రైతుల భూముల విషయానికి వచ్చేసరికి మాత్రం ఎక్కడ లేని భూ సమస్యలు తలెత్తడం గమనార్హం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు భూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలనూ పట్టించుకోకపోవడంతో, తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నారు. అక్కడా పరిష్కారం కాకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ నాలుగో తేదీ వరకు కలెక్టర్ గ్రీవెన్స్‌కు 1430 వినతులు వచ్చాయి. అందులో ఇప్పటివరకు 631 సమస్యలను పరిష్కరించారు. 799 ఫిర్యాదులు ప్రగతిలో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. వీటిలో రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్‌ఒఆర్) 276 వినతులు రాగా, 121 వినతులనే పరిష్కరించారు. రీ సర్వేపై 234 ఫిర్యాదులు రాగా 115 పరిష్కరించారు. తప్పుడు రికార్డులతో భూములు సొంతం చేసుకున్నారంటూ 137 ఫిర్యాదులు రాగా, అందులో 54 వినతులను పరిష్కరించారు. భూ ఆక్రమణలపై 128 ఫిర్యాదులు రాగా, 45 మాత్రమే పరిష్కరించారు. ఇలా 19 కేటగిరీల్లో కలిపి మొత్తం మీద మూడు నెలల కాలంలో 44.12 శాతం సమస్యలనే పరిష్కరించగలిగారు.

సచివాలయ ఉద్యోగులూ కారణమే

రైతుల కడగండ్లకు గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులూ కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మ్యుటేషన్ కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్తున్నా, దరఖాస్తులు నమోదు చేయడం లేదు. విఆర్‌ఒలు, సర్వేయర్లు ఫీల్డ్‌కు వెళ్లిపోతుండడంతో, చాలాచోట్ల డిజిటల్ అసిస్టెంట్లు అది తమ పని కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో రైతులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ చివరకు గ్రీవెన్స్‌కు వస్తున్నారు.

అవే రెవెన్యూ పాపాలను కొనసాగిస్తున్న ప్రభుత్వం

భూ సమగ్ర సర్వే సందర్భంగా చోటుచేసుకున్న పాపాలనే ప్రస్తుత టిడిపి ప్రభుత్వమూ కొనసాగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవెన్యూశాఖ దగ్గరకు వచ్చేసరికి ఆ రకమైన చర్యలు కనిపించడం లేదు. భూసమగ్ర సర్వేలో పలుచోట్ల అవకతవకలకు పాల్పడినట్లు అనేక మంది విఆర్‌ఒలు, సర్వేయర్లపై ఆరోపణలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా డబ్బులకు ఆశపడి కొందరు ఈ అక్రమాలు చేసినట్లు చర్చ నడుస్తోంది. డ్రోన్‌లు, కంప్యూటర్లు ఒకరి పేరు మీద ఉన్న భూములు వేరే వారి పేరు మీద మార్చేలేవన్నది అందరికీ తెలిసిందే. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఇతర పలుకుబడి ఉన్న నాయకుల భూములన్నీ సరిగా ఉన్నా, సామాన్య రైతుల భూముల్లోనే తేడాలు రావడం గమనార్హం. ఇవన్నీ గతంలో మండల కేంద్రం వేదికగానే ఇవి చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నా, వారిపై చర్యల జోలికి ప్రభుత్వం వెళ్లడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా రెవెన్యూశాఖలో లోపాలను సరిదిద్ది రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణాలివే..

రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన పాపానికి భూ సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ సిబ్బంది లీలలతో ఒకరి భూమి వేరే వారి పేరు మీద నమోదు కావడం, భూమికి సంబంధం లేని వ్యక్తులు జాయింట్ ఎల్‌పిఎంలో ఉండడం, సర్వే నంబర్లు గల్లంతు కావడం వంటి సమస్యలు తలెత్తాయి. వీటిలో మండల స్థాయిలోనే పరిష్కరించే అవకాశమున్నా కొంతమంది తహశీల్దార్లు జెసికో, గ్రీవెన్స్‌కో పంపిస్తున్నారు. హద్దులు చూపడం (ఎఫ్ లైన్), సిబ్బందితో రీసర్వే చేయించడం వంటి పనులు తహశీల్దార్లే చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు వివాదం లేని జిరాయితీ భూమి 22ఎ లేదా ప్రభుత్వ భూమిగా నమోదైతే, ఆర్‌డిఒ ద్వారా కలెక్టర్‌కు పంపితే డాక్యుమెంట్లను పరిశీలించి 22ఎ నుంచి తొలగిస్తారు. అదేవిధంగా పీసుపుల్ ఎంజైయ్‌మెంట్ ఉంటే విచారణ చేసి మ్యుటేషన్స్‌కు తహశీల్దార్లే సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఇవేవీ చేయకపోవడంతో బాధితులు గ్రీవెన్స్‌బాట పడుతున్నట్లు తెలుస్తోంది. వీటినే జెసి తిరిగి మండలాలకు రాస్తుండడంతో, భూ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుందన్న చర్చ నడుస్తోంది.

జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

'టెట్'పై రివ్యూ పిటిషన్ వేయాలి

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి
- డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

టెట్ నుంచి సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ అనాలోచిత విధానాల వల్ల విద్యాశాఖ అధోగతి పాలవుతోందని, విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ధనలక్ష్మి మాట్లాడుతూ 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు ఉమాశంకర్ మాట్లాడుతూ విద్యాశాఖ మొత్తం వైఫల్యానికి కమిషనర్ బాధ్యత వహించాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులకు సెలవుల మంజూరు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పూర్తిగా పాఠశాలలోనే ఉంచి తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు మాట్లాడుతూ తక్షణమే వంద రోజుల ప్రణాళిక నుంచి రెండో శనివారం, ఆదివారాలు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రతిరోజూ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించాలనే నిబంధన తొలగించాలన్నారు. ఈ ఏడాది జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పి.సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు హనుమంతు అన్నాజీరావు, బి.రవికుమార్, స్వర్ణకుమారి, రాష్ట్ర కౌన్సిలర్ దమయంతి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - గార

నిబంధనల మేరకు పక్కగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. గార మండలంలోని శ్రీకూర్మం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలును బుధవారం పరిశీలించారు. ట్రక్‌షీట్ జనరేట్ విధానాన్ని పరిశీలించి, కొనుగోళ్ల పరిస్థితిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకూర్మంలోని సాయి శ్రీనివాస మోడ్రన్ రైస్‌మిల్లును పరిశీలించారు. బరాటం రామశేషు ట్రేడర్స్ ఎరువుల దుకాణం మూసివేసి ఉండడంపై జెసి ప్రశ్నించారు. గారలోని శ్రీ వెంకటేశ్వర మోడ్రన్ రైస్ మిల్లును పరిశీలించి, పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎఒ డి.పద్మావతి, ఇతర సిబ్బంది ఉన్నారు.

సమన్వయంతో 'అభ్యుదయం' సైకిల్‌యాత్ర

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి చేతుల మీదుగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఈనెల 12వ తేదీన ప్రారంభమయ్యే 'అభ్యుదయం' సైకిల్‌యాత్ర జిల్లాలో ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు సాగుతుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. సైకిల్‌యాత్రను పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, విద్య, మెడికల్ అండ్ హెల్త్, ఉమెన్ అండ్ చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సైకిల్ యాత్ర నిర్వహణపై జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ యువతలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులను సైకిల్ యాత్రలో భాగస్వామ్యం చేయాలన్నారు. యాత్రలో పాల్గొనబోయే విద్యార్థుల జాబితా, సంఖ్యను ముందుగానే సమర్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. సైకిల్ యాత్ర అనంతరం శ్రీకాకుళం నగరంతో పాటు ప్రతి మండల కేంద్రంలో అవగాహనా సమావేశాలు నిర్వహించి, మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ యాత్రలో ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. వైద్య సదుపాయాలు, అంబులెన్సులు అందుబాటులో ఉండేలా వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, నిర్మూలన లక్ష్యంగా చేపడుతున్న సైకిల్‌యాత్ర ప్రధాన అంశాన్ని ప్రజలకు చేరవేయడానికి పోస్టర్లు, అవగాహనా ఈవెంట్లు రూపొందించాలని సూచించారు. ఈగల్ టోల్ ఫ్రీ నంబరు 1972, పోలీసు అత్యవసర నెంబర్ 112 ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. అన్ని శాఖల నుంచి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని కార్యాచరణ చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌పి వివేకానంద, విద్యాశాఖ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లు, సిఐలు పాల్గొన్నారు.

21 నుంచి పల్స్ పోలియో

- 1.55 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో 0 నుంచి ఐదేళ్ల వయసు గల 1,55,876 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతై జిల్లాలో ఈ మూడు రోజుల్లో సుమారు 6,18,024 ఇళ్లను సందర్శించి 1.55 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు. కార్యక్రమం మొదటి రోజు 21న పోలియో బూత్‌ల్లో, తర్వాత రెండు రోజులు 22, 23న ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం కోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 1,252 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 683, గిరిజన ప్రాంతాల్లో 377, పట్టణ ప్రాంతాల్లో 192 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రద్దీగా ఉండే బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, ఆలయాలు, సంతల వద్ద ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం 40 ట్రాన్సిట్ బూత్‌లు పనిచేస్తాయన్నారు. వీటికి అదనంగా వీధులు, పొలాల్లోని పిల్లలను కవర్ చేయడానికి 84 మొబైల్ బృందాలను నియమించినట్లు తెలిపారు. వలసలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు వంటి 101 హైరిస్క్ ఏరియాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లోని 6,732 మంది పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు మొత్తం 7,430 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. వీరి పర్యవేక్షణ కోసం 122 మంది సూపర్‌వైజర్లను, 71 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 15 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇతర కేంద్రాలకు వ్యాక్సిన్ సరఫరా కోసం 206 వాహనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం 2,90,000 ఓరల్ పోలియో వ్యాక్సిన్ డోస్‌లు అవసరమవుతాయని అంచనా వేశామన్నారు. 1,186 మంది పారామెడికల్ సిబ్బంది, 2,047 ఆశా కార్యకర్తలు, ఆరు వేల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాలుపంచుకుంటారని చెప్పారు. వ్యాక్సిన్ నిల్వ, నాణ్యత కాపాడేందుకు కోల్డ్ చైన్ వ్యవస్థను పకడ్బందీగా సిద్ధం చేశామన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంలో 5 డీప్ ఫ్రీజర్లు, 13 ఐఎల్‌ఆర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఆడియో క్యాసెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల ముందు నుంచే గ్రామాల్లో ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని డిఎంహెచ్‌ఒ అనితను ఆదేశించారు.

రూ.27.30 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

- ఐదుగురు నిందితులు అరెస్టు
- డిఎస్‌పి సిహెచ్.వివేకానంద

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బూర్జ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.27.30 లక్షల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తెలిపారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన ఉండ్రు నాగరాజు, అదే జిల్లా చింతలచెరువుకు చెందిన మద్దిల చంటిబాబు, విశాఖపట్నం జిల్లా గంగవరానికి చెందిన చేపల ఆనంద్, అనకాపల్లి జిల్లా మాటూరుకు చెందిన మాటూరు శ్రీను, బిహార్ రాష్ట్రం బెగుసరి జిల్లాకు చెందిన శుభం మిశ్రాను అరెస్టు చేశామని చెప్పారు. నిందితుల నుంచి 210 గ్రాముల బంగారం, 709 గ్రాముల వెండి ఆభరణాలు, వస్తువులు, రూ.83,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మాటూరు శ్రీను కొంతకాలం కిందట ఒక కేసులో జైలుకు వెళ్లినప్పుడు అక్కడ చేపల ఆనంద్ పరిచయమయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏదైనా తాళం వేసిన ఇల్లు ఉంటే దొంగతనం చేసి, చోరీ సొత్తును పంచుకుందామని ఆనంద్ శ్రీనుకి చెప్పాడు. బూర్జ గ్రామంలో చెన్నూరు రమేష్ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన శ్రీను, ఆ విషయాన్ని ఆనంద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఆనంద్ తన స్నేహితులైన నాగరాజు, చంటిబాబు శుభం మిశ్రాతో కలిసి ఈనెల ఒకటో తేదీన రమేష్ ఇంటికి వేసి ఉన్న తాళాన్ని గునపంతో పగులగొట్టారు. రెండు బీరువాల్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును చోరీ చేసి వచ్చిన కారులోనే గాజువాక వెళ్లిపోయారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు కేసుని ఛేదించారు. పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ల పరిధిలో చంటిబాబు, శుభం మిశ్రా చోరీలు చేసినట్లు తెలిపారు. నాగరాజుపై పలు పోలీస్‌స్టేషన్లలో 24 కేసులు, ఆనంద్‌పై 24 కేసులు, శ్రీనుపై రెండు కేసులు, చంటిబాబుపై 8 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సిఐ పి.సత్యనారాయణ, ఎస్‌ఐలు ప్రవల్లిక, బాలరాజు తదితరులను ఎస్‌పి మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ ప్రవల్లిక ఉన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రెండేళ్లలో కేంద్రీయ విద్యాలయం పూర్తి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

రెండేళ్లలో కేంద్రీయ విద్యాలయం కొత్త భవనాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాట్లను విశాఖపట్నం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం బుధవారం పరిశీలించింది. పలాస రైల్వే ఆర్‌పిఎఫ్ బ్యారక్స్‌ను పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసేందుకు సముఖత వ్యక్తం చేసింది. కేంద్ర బృందం సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తరగతులు ప్రారంభించడానికి అన్నివిధాలా సహాయం అందిస్తామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక వసతి గదుల్లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తామన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ బోధనలు ఉంటాయన్నారు. మూడో తరగతి నుంచే కంప్యూటర్ విద్యను అందించడానికి చర్యలు తీసుకోనున్నారని, అందుకు అవసరమైన ల్యాబ్, తరగతి గదులు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఉద్దానం ప్రజలకు కేంద్రీయ విద్యాలయం ద్వారా ఉన్నత విద్య అందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర బృందం వెంట తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, టిడిపి నాయకులు ఎల్.కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, జి.సూర్యనారాయణ, సవర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ పోలినాయుడు

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం యువతరం అడుగులు వేయాలన్నారు. ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా వారి బంగారు భవిష్యత్ కోసం ఆదర్శవంతమైన మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. యువత బాగున్నప్పుడే దేశం బాగుంటుందన్నారు. ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి మాట్లాడుతూ పాలకవర్గాల విధానాల వల్ల సమాజంలో నైతిక విలువలు పతనమవుతున్నాయన్నారు. మద్యం వంటి వాటిపై వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ ఆదాయ వనరుగా చూడడం వల్లే యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి మాట్లాడుతూ మత్తు పదార్థాల కారణంగానే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోకి చొరబడిందన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.హరిత, ఐక్యుఎసి కోఆర్డినేటర్ జి.రాజశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ శ్రీనివాస్ పాత్రో, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ ఎస్.అరుణకుమారి, ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రవీణ, డి.సూర్యుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - పలాస

టిడిపి కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యాన మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక కుటుంబంలో మహిళను విద్యావంతురాలు చేయడం వల్ల ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తద్వారా ఆ గ్రామం మొదలుకొని దేశం అభివృద్ధిపథాన పయనిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ఒక బండికి ఉండే రెండు చక్రాలు లాంటివని, ఏ చక్రం లేకపోయినా బండి ముందుకు కదలదన్నారు. అదేవిధంగా సంక్షేమం, అభివృద్ధిలో ఏ ఒక్కటి తక్కువైనా ప్రగతి ఉండదన్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. అందరి సహాయ సహకారాలతో పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధిపథాన నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అమ్మన్నాయుడు

మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న అఖిల భారత సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పొందూరు మండలంలోని అంబేద్కర్ కూడలిలో బుధవారం సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేటర్లకు మేలు చేసేందుకు కార్మికవర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. జనవరి 4న విశాఖపట్నంలోని ఆర్‌కె బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం, అంగన్వాడీ, ఆశ మధ్యాహ్న భోజనం దితర స్కీమ్ వర్కర్స్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పి.అప్పలనాయుడు, త్రినాథ్ పాల్గొన్నారు.

కంచిలి : సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిస్తూ... కంచిలిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పిట్ట కృష్ణారావు, పాపారావు ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : విశాఖపట్నంలో ఈనెల 31 నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభల విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో సిఐటియు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు అప్పలనరసమ్మ, ఆర్.అరుణ, తులసి, జయలక్ష్మి పాల్గొన్నారు.

రూ.9.69 కోట్లతో రోడ్ల నిర్మాణాలు

ఆమదాలవలస : నియోజకవర్గంలోని ఆరు రహదారుల నిర్మాణాలకు రూ.9.69 కోట్ల నిధులు మంజూరైనట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొందూరు మండలం పెనుబర్తి నుంచి తోలాపి, కింతలి నుంచి సింగూరు, సరుబుజ్జిలి మండలం జెజె రోడ్డు నుంచి చిగురువలస, బూర్జ మండలం కాళపర్తి నుంచి ఆమదాలవలస మండలం చింతలపేట వరకు, బూర్జ మండలం సిఎస్‌పి రోడ్డు నుంచి బొమ్మిక, తోటవాడ నుంచి ఎన్.ఎల్.పురం రోడ్ల నిర్మాణాలకు ఈ నిధులు కేటాయించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌కు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కోటి సంతకాలు విజయవంతం

మెళియాపుట్టి : మాట్లాడుతున్న సీతారాం, రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన 'కోటి సంతకాల' కార్యక్రమం పాతపట్నం నియోజకవర్గంలో విజయవంతంగా ముగిసిందనిమాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు రెడ్డి శాంతి నాయకత్వంలో వైసిపి నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు బుధవారం పాల్గొన్నారు. సంతకాల పత్రాలను ప్రత్యేకంగా సిద్ధం చేసిన వాహనంలో భద్రపరిచారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించడంతో పాటు సంతకాల పత్రాలతో ఉన్న వాహనాన్ని అధికారికంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.వి.సురేష్, బి.ఉదయ్‌కుమార్, యు.బాలరాజు, ఎం.శ్యామ్, సవరిగాన ప్రదీప్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మెడికల్ కళాశాలల వ్యవహారంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణకు స్పందన వచ్చిందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. కోటి సంతకాల సేకరణ పత్రాలు జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా లొద్దపుట్టి తులసమ్మ ఆలయం వద్ద ఉన్న ప్రజాస్వామ వద్ద పత్రాలు పంపించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

రణస్థలం: మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ర్యాలీ జెండాను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఈ పత్రాలను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన రచ్చబండ-కోటి సంతకాల సేకరణకు అన్నివర్గాల ప్రజల నుంచి వచ్చిన స్పందనే నిదర్శనమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. కోటి సంతకాల సేకరణ పత్రాలను జిల్లా కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జెండా ఊపి ప్రారంభిస్తున్న విజయ

పిజి ప్రవేశాలకు నోటిఫికేషన్

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేరుగా పిజి కోర్సుల్లో ప్రవేశానికి నోటిపికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు ఎటువంటి ప్రవేశం పరీక్ష ఉత్తీర్ణత శాతం లేకుండా నిర్థిష్ట క్వాలిపికేషన్ ఉన్నవారు చేరవచ్చునని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఓరిజనల్ ధ్రువపత్రాలతో కళాశాల పనిచేసే సమయంలో డైన్స్ విభాగం అధిపతి సి.కవితను సంప్రదించాలన్నారు.

21న ఘంటశాల శతజయంతి వేడుకలు

అరసవల్లి: ఈ నెల 21న హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో 118 ఘంటసాల ఆలపించిన పాటలతో 60 మంది గాయని గాయకులతో 12 గంటల నిర్విరామ ఘంటసాల పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి ముద్దాలి రఘురాం, కె.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వినాయక ఆలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 1994 నుంచి నిర్విరామంగా ప్రతి జిల్లాలోనూ ఘనంగా నిర్వహించామని తెలిపారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, జంధ్యాల శరత్‌బాబు, మండ కామేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వాసితుల కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే గౌతు శిరీష

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

నాలుగు మండలాలకు సాగునీరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకు తాగునీరు అందించేందుకు నిర్మాణమవుతున్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్వాసితులకు నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీని సుందరంగా తీర్చిదిదతామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి కోసంగిపురం వద్ద ఆఫ్‌షోర్ నిర్వాసితులకు నిర్మించిన కాలనీలో రూ.7.66 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19లో టిడిపి పాలనలో ప్రతిష్టాత్మకంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకు శ్రీకారం చుట్టామని చెప్పారు. వైసిపి పాలనలో నిర్వాసితుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. తన తండ్రి గౌతు శివాజీ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తన హయాంలో అకుంఠిత దీక్ష చేపట్టి ప్రత్యేక దృష్టిసారించి నిర్వాసితులకు న్యాయం చేశారన్నారు. అనంతరం నిర్వాసితులతో మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీరికట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్, గురిటి సూర్యనారాయణ, ఎస్.రాంబాబు, పంచాయతీ అధికారి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఆర్‌పిలు

సిఆర్‌పిలను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- పలాస

సిఆర్‌ఎంటిలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని సిఆర్‌పిలు యు.అప్పలరాజు, పొలారి శేషగిరి, దుంపల సునీల్‌బాబు, ఎస్.భాస్కరరావు. ఎస్.కేశవ్ ఎర్మీయ, దుర్యోధన శంకరరావు కోరారు. పలాస ఎంఆర్‌సి కేంద్రం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ట్రావెలింగ్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని కోరారు. పాఠశాల విద్య సమగ్ర శిక్షణలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ అర్హతలతో పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలను డిఎస్‌సిలో వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఫేషియల్ అటెండెన్స్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో వేసే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. గ్రాట్యూటీ, ఇతర విశ్రాంత బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఇతర ఉద్యోగులకు వర్తించే పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎవరైన అనారోగ్య, ప్రమాదంలో మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా రూ.పది లక్షలు, వారి కుటుంబంలోని ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

మిల్లర్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైస్‌మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. మండలంలో వారం రోజులుగా ధాన్యాన్ని అమ్ముకునేందుకు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను సమయానికి సమర్పించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని టెక్కలి మిల్లులకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్‌డిఒ స్వయంగా మండలంలోని మిల్లులను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లర్ల యజమానులతో మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలను సమర్పించేందుకు అంగీకరించారు. రైతుల నుంచి ధాన్యం లోడ్లను స్వీకరిస్తామని మిల్లర్లు హామీ ఇవ్వడంతో రైతులకు భారీగా ఉపశమనం లభించింది. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, డిటి రాము, సివిల్ సప్లై డిటి కుమారి, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, మిల్లర్ల ప్రతినిధులు హరినాథ్, రమేష్, విజయ్, ఉర్లాన వసంత్ ఉన్నారు.

పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఏసుబాబు, హరినాథ్

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చాపర ప్రభుత్వాస్పత్రిలో బుధవారం చాపర ఏసు ప్రభువు భజన బృందం సభ్యులు గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి భజన మండలి సభ్యుడు కిల్లంశెట్టి హరినాథ్, స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. భజన బృందం సభ్యులు మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం మెరుగుపడేందుకు, పౌష్టికాహార లోపాలు తగ్గేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది వారి సేవాభావాన్ని అభినందించారు.

ప్రారంభిస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు బాబ్జీ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్ఛాపురం: మండలంలో తేలుకుంచి పంచాయతీలో రైతు సేవా కేంద్రంలో పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులు బారిన పడకుండా రైతులు కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం అమ్మకాలు చేపట్టాలని అన్నారు. ఎఒ అజయ్ కుమార్, సిఇఒ భుజంగరావు, టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, మాజీ సర్పంచ్ మెరుగు సూర్యనారాయణరెడ్డి, పాలకవర్గ సభ్యులు గిన్ని బాలరాజు పాల్గొన్నారు.

లక్ష్మితో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు

వికలాంగురాలికి చేయూత

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొగిడియాపుట్టుగకు చెందిన నిరుపేద వికలాంగ మహిళ బొగిడియా లక్ష్మి కూలి పనిలో సంభవించిన ప్రమాదంలో కుడికాలు కోల్పోయింది. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈ విషయం సంస్థ సభ్యుడు కొరికాన మన్మథరావు ద్వారా తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సంస్థ ఆమెకు అండగా నిలవాలని ముందుకొచ్చింది. అనుకున్నదే తడవుగా చేతన ఫౌండేషన్ ఛారిటబుల్ ట్రస్టు, మదర్ థెరీసా ఫౌండేషన్ భాస్కర్‌ను సంప్రదించి బుధవారం లక్ష్మికి కృత్రిమ కాలు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ లక్ష్మి దయనీయ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆమెకు వికలాంగ పించన్ మంజూరుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

'పది' మోడల్ ప్రశ్నాపత్రాల పంపిణీ

మోడల్ ప్రశ్నాపత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి- మందస

యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఆధ్వర్యాన నిష్ణాతులైన ఉపాధ్యాయులతో రూపొందించిన పదో తరగతి మోడల్ టెస్టు పేపర్లను మండల ఎస్‌ఆర్‌ఎస్‌ఎం జెడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు 130 మంది విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. ఎస్ఎస్‌సి 1987 బ్యాచ్‌కి చెందిన వ్యాపారవేత్త వడ్డి గోపాల్ ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, కోశాధికారి సోమనాథ్ శిష్టు మాట్లాడుతూ యుటిఎఫ్ అంటే ఉద్యమాలు, పోరాటాలే కాదు సామాజిక స్పృహ కలిగి అకడమిక్ సైడ్ నుంచి ఏటా టెస్టు పేపర్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల పూర్వ అధ్యక్షులు దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ పండి మల్లికార్జునరావు, సురేష్ చంద్రపండ, పితంబరం మాలి, డి.సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కవిటి : అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సోంపేట

నియోజకవర్గ అంతర పాఠశాలల నియోజకవర్గస్థాయి (గ్రిగ్స్) పోటీల్లో బి.ఆర్.సి.పురం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో కె.గణేష్ లాంగ్ జంప్, 800 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానాలు, వ్యక్తిగత ఛాంపియన్ షిప్, 1500 మీటర్ల రన్నింగ్ పాటిల్ హరీష్ మహంతి ద్వితీయ స్థానాన్ని పొందారని తెలిపారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో 800 మీటర్లలో రుతు మహంతి ద్వితీయ స్థానాన్ని, రిలేలో ద్వితీయ స్థానాన్ని కె.గణేష్, హరీష్, కృష్ణమూర్తి, వేణు గెలుపొందారని తెలిపారు. పాఠశాలకు స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ బహుకరించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సత్యవతిని, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

ఇచ్ఛాపురం : నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన అంతర్ పాఠశాల క్రీడా పోటీల్లో డొంకూరు విద్యార్థులు ఆల్‌రౌండ్ ఛాంపిన్‌షిప్ కైవసం చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.జానికిరావు, ఉపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ, శ్రీహరి, కమలాకర్, కృష్ణారావు, గోవిందరావు, శంకర్‌రెడ్డి, నూక్కయ్య, రాఘవేంద్ర, ఈశ్వరరావు, గంగావేణి, శేషశ్రీ పాల్గొన్నారు.

కవిటి: ఇచ్ఛాపురంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన గ్రిగ్స్ క్రీడా పోటీల్లో పాల్గొన్న కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. బాలుర కబడ్డీ విభాగంలో బొరివంక పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, ఖోఖో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. అదేవిధంగా వాలీబాల్ జూనియర్ విభాగంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, ఎన్.విశ్వనాథం, ఎంపిటిసి మాజీ సభ్యుడు బెందాళం విజయ్ కృష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు బల్లెడ సౌమ్యశ్రీపతి, తెప్పల మోహనరావు పాల్గొన్నారు.

పిఆర్ వైన్స్ సీజ్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పిఆర్ వైన్స్ మద్యం దుకాణాన్ని బుధవారం ఆమదాలవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు సీజ్ చేశారు. ఇటీవల ఈ మద్యం దుకాణంలో నీటిని కల్తీ చేసి విక్రయిస్తున్న మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొబిషన్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు మద్యం షాపుపై దాడి చేసి కేసు నమోదు చేసి షాపు యజమానితో పాటు ఇద్దరు నిర్వాహకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసు నమోదు చేసిన మరుసటి రోజు నుంచే సరుబుజ్జిలిలో యథావిథిగా పిఆర్ వైన్స్ అమ్మకాలు నిర్వహిస్తుండడంపై వైసిపి నాయకులు ఇటీవల ప్రభుత్వ దుకాణంలో కల్తీ మద్యం పట్టుబడింది. తూతూమంత్రంగా అధికారులు చర్యలు తీసుకున్నారని పలు ఆరోపణలు చేశారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రోహి బిషన్ అధికారుల దర్యాప్తు అనంతరం ఆముదలవలస ఎక్సైజ్ ఎస్ఐ కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం పిఆర్ వైన్ షాప్ వద్దకు చేరుకొని షాపులో తనిఖీలు నిర్వహించిన అనంతరం మద్యం దుకాణం తలుపులు మూసివేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

క్రీడలతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- కొత్తూరు

క్రీడలతోనే ఆరోగ్యం వస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు అధ్యక్షతన నియోజవర్గస్థాయి అంతర్ పాఠశాలల బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్, అథ్లెటిక్స్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ముందుగా వాలీబాల్ సర్వీస్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పోటీల్లో తలపడి విజయం సాధించి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను, వెజిటేబుల్ గార్డెను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, డిటి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ గణపతి, ధనం జయరావు, ఎంఇఒ ఎన్.శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ జాయింట్ సెక్రటరీ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ అకౌంట్లు, సిఆర్‌పి, అటెండర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గత ఆరేళ్ల నుంచి తమకు జీతాలు పెంచలేదని వివరించారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామీణ తారు రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే గౌతు శిరీష కంకణం కట్టుకున్నారని టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. మండలంలోని రాజాంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రూ.2.23 కోట్లతో బాతుపురం నుంచి చిన్నరాజాం కాలనీ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో గ్రామాలను అనుసంధానం చేస్తూ కొత్త తారు రోడ్ల నిర్మాణాలు చేపట్టడం గౌతు కుటుంబం దూర దృష్టికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయంలో రహదారులు దుస్థితి దీనావస్థలో ఉండేదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. రూ.4 కోట్లుతో పూడిలంక వంతెన, రాకాసి గెడ్డ వంతెన, ఈ నువ్వలరేవు వంతెన, బెంది తారు రోడ్లుతో పాటు 24 తారు రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో ఎమ్మెల్యే తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతనపల్లి సాంబమూర్తి, టిడిపి నాయకులు బి.శేశిభూషణ్, బుంగ ప్రసాద్, రాపాక శాంతమూర్తి, అంబటి రామకృష్ణ, దుర్గారావు, మురిపింటి నారాయణ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోగోను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

సిల్వర్ జూబ్లీ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల 25 సంవత్సరాల ప్రత్యేక ప్రయాణాన్ని సూచించే ఈ లోగో బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ స్థాపన నుంచి ఇప్పటి వరకూ ఐతమ్ సాధించిన పురోగతి, ప్రతిభ, జాతీయ-అంతర్జాతీయ స్థాయి గుర్తింపు, విద్యా ప్రగతి, ప్రయాణంలో నమోదు చేసిన మైలురాళ్లపై ఒక విశేష ప్రజెంటేషన్ అందించారు. తరువాత అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూసిన సిల్వర్ జూబ్లీ లోగో గ్రాండ్ రివీల్ కౌంట్‌డౌన్‌తో ఘనంగా ఆవిష్కరించారు. ఈ లోగో సంస్థ గత 25 ఏళ్ల శ్రేయోభిలాష, విజయం, నిబద్ధత, భవిష్యత్ దిశను ప్రతిబింబించేలా రూపకల్పన చేయబడిందిని అన్నారు. ముఖ్య అతిథి ఎ.నరేష్‌కుమార్ తన ప్రసంగంలో ఐతమ్ విద్యా ప్రమాణాలు, పరిశోధన-ఆవిష్కరణల ప్రోత్సాహం, విద్యార్థుల ప్రతిభాపాటవాలను ప్రశంసిస్తూ, రాబోయే 25 సంవత్సరాల్లో సంస్థ మరింత ఉన్నత శిఖరాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నందిగాం : మండల రిసోర్స్ కేంద్రంలో అటెండర్‌గా పనిచేస్తున్న సిహెచ్.మోహన్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం మండల ఉపాధ్యాయ జెసి అభ్యర్థన మేరకు మండలంలోని ఉపాధ్యాయులు, ఇటీవల ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటి ఉపాధ్యాయులు ఉదార స్వభావంతో విరాళాలు సేకరించారు. రూ.64,100 ఎంఇఒ జి.నరసింహులు చేతుల మీదుగా బుధవారం మోమన్‌కు అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఇఒ నరసింహులు

అడ్వంచర్ క్యాంప్‌నకు వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బయలుదేరుతున్న వర్సిటీ విద్యార్థులు

ధర్మశాల (హిమాచల్ ప్రదేశ్)లోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో ఈ నెల 12 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ అడ్వంచర్ క్యాంప్-2025లో పాల్గొనేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థులు బృందం బుధవారం బయలదేరి వెళ్లింది. అంబేద్కర్ యూనివర్సిటీకి చెందిన ఎంబిఎ విద్యార్థులు బూరవల్లి హర్ష వర్ధన్, పావడ సాంబశివ, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డొంకాన యశ్వంత్ (బిఎస్‌సి), కోట తరుణ్ రెడ్డి (బికాం), సవర రాఘవేంద్రరావు (బిఎ), రొక్కం భార్గవి (బికాం), ఇసై మమత (బిఎస్‌సి), కాశీబుగ్గ ఎస్బిఎస్వైఎం కళాశాలకు చెందిన పోతనపల్లి మానస (బిఎస్‌సి), బెహరా త్రిష (బిఎస్‌సి) ఈ క్యాంపులో పాల్గొనున్నారు. యూనివర్సిటీ ప్రతినిధిగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ వి.ల్యూక్పాల్ కంటింజెంట్ అధికారిగా వ్యవహరిస్తారు. కాగా, ఈ క్యాంపునకు బయల్దేరుతున్న సందర్భంగా వర్సిటీ విసి ఆచార్య కె.ఆర్.రజని, ఎస్ఒ డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ అభినందనలు తెలిపారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించం

ప్రజాశక్తి- పలాస

పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

మున్సిపాలిటీ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించడం కుదరదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కాంట్రాక్టర్లకు హెచ్చరించారు. మొగిలిపాడు కుమ్మరి వీధిలో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.ఐదు లక్షలతో నిర్మాణం చేపడుతున్న సిసి రోడ్డు, కాలువ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డి నాగభూషణరావు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

బాల్య వివాహాలు వద్దు

ప్రజాశక్తి- బూర్జ

ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

బాల్య వివాహాలు వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయని ఐసిడిఎస్ పిఒ ఎస్.గీత అన్నారు. బాల్య వివాహ ముక్తభారత్ వంద రోజులు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.కె.రాజపురం ప్రభుత్వ హైస్కూలక్షలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలపై బాలికలకు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వై.మాలతి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

విద్యార్థినికి ఎమ్మెల్యే ప్రోత్సాహం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన పెద్ద లోగిడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రసన్నను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెకు రూ.పది వేలు ప్రోత్సాహకంగా అందజేశారు. పాతపట్నం మండలంలోని పెద్దలోగిడికి చెందిన దొర చిన్నరావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరచి నేషనల్ టీమ్‌కు ఎంపిక కావడం నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభచాటడం పాతపట్నం ప్రతిష్టను పెంపొందించే అంశమని పేర్కొన్నారు. క్రీడల్లో అవకాశాలు అపారంమని, క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, విజయ సాధన సామర్థ్యాలను పెంచుతాయని అన్నారు. లక్ష్మీప్రసన్న లాంటి విద్యార్థులు మరింత మంది పిల్లలకు స్ఫూర్తి కావాలన్నారు. లక్ష్మీప్రసన్నకు శిక్షణనందించిన గురువులు, ఆమె ప్రతిభను ప్రోత్సహించిన తల్లిదండ్రుల పాత్రను ప్రశంసించారు. భవిష్యత్‌లో విద్యార్థుల ప్రతిభను మరింతగా ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ కార్యాలయంలోని ఉద్యోగులను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు మోహనరావు. శోభన్, శంకర్, సంతోషిలు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్. ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, రామకృష్ణ, ఢిల్లేశ్వరి, వెంకటరావు పాల్గొన్నారు.

జెండర్ సమతుల్యత దిశగా అడుగులు

వజ్రపుకొత్తూరు : జెండర్ సమతుల్యత దిశగా సమాజం అడుగులు వేయాలని సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. వజ్రపుకోతురులో జెండర్ క్యాంపైన్‌లో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 23 వరకు నాలుగు వారాలు పాటు గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మొదటి వారం ఆమె పనిచేయడం ద్వారా భారతదేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రెండో వారం అవకాశాలు సమానత్వానికి మార్గాలు సృష్టిస్తాయని అన్నారు. మూడో వారం భద్రమైన మార్గాలు అభివృద్ధికి సోపానాలు అని అన్నారు. నాలుగో వారం ఇంటిపని అందరిది అనే అంశాలపై కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు సరస్వతమ్మ, చంద్రకళ, సోంపమ్మ, సిసి రేణుక, అకౌంటెంట్ సౌజన్య, మీనా పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యాన బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్ ఏర్పాటు చేశారని అన్నారు. మానవ హక్కులు మంచి రేపటిని రూపొందించుకోవడానికి వ్యక్తులు, సంఘాలను శక్తివంతం చేయగలవు అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఒ కె.అప్పారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు మాట్లాడుతూ మానవుల హక్కుల గురించి వివరించారు. మానవ హక్కులు అంటే ఏమిటి దానిని ఎలా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్వర్ణభారతి డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల కార్యదర్శి ఎం.రాంబాబు, ఎడ్యుకేషనల్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కె.సి.పూరి, జూనియర్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్

టెక్కలి : మాట్లాడుతున్న సతీష్‌కుమార్

సంతోష్, ఆదిత్య కాలేజ్ ప్రిన్సిపాల్ రమణ, కామేష్, శేఖర్ ఆదిత్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : ప్రతిఒక్కరూ మానవ హక్కులను వినియోగించుకోవాలని పలాస సివిల్ జడ్జి మాధురి అన్నారు. పలాస కోర్టు ఆవరణలో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కె.ఆర్.పట్నాయక్, సెక్రటరీ బెండి కాళిదాస్, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజు, ఎపిపిలు రమేష్, వెంకటరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పొందూరు: మానవ హక్కుల ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.మధుసూదనరావు అన్నారు. పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో మానవహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, పాలిటిక్స్ లెక్చరర్ అప్పారావు పాల్గొన్నారు.

టెక్కలి; సమాజంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువుతో పాటు మానవ హక్కులపైనఅ అవగాహన కల్పించుకోవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో పొలిటికల్ సైన్స్ విబాగం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వైకుంఠరావు పాణిగ్రాహి, అద్దాల రాజేష్‌కుమార్, ఓ.కోటేశ్వరరావు, లీలాపద్మజ, రెయ్యిమ్మ, ఎస్.ధర్మారావు పాల్గొన్నారు.

సోంపేట : ఆరో అదనపు జిల్లా జడ్జి కోడూరు కిషోర్‌బాబు ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జి.ఎస్.శైలేంద్ర, మడ్డు సర్వేశ్వరరావు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, న్యాయవాదులు రుక్మాంగదరావు, కళ్యాణి పాల్గొన్నారు.

అలాగే బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, న్యాయవాది కె.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

అవగాహనతోనే ఆర్థికాభివృద్ధి

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది ఎంటర్ప్రెనర్ యాక్టివిటీ చేసే ముందుగానే చేపట్టబోయే కార్యక్రమానికి పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ఆ వ్యాపారంలో ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు యాభాజీ రమణమ్మ అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విధమైన ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇన్స్పెక్షన్, ఛార్జీలు లేకుండా పంచసూత్రాలు పాటిస్తున్న సంఘ సభ్యుల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు కేవలం 92 పైసలు వడ్డీతోనే సంఘానికి రూ.8 లక్షల వరకు ఇసుందన్నారు. అలాగే స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఒకే పంట పండిస్తున్న మహిళా రైతులందరూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకొని ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతుల ద్వారా లాభసాటి వ్యవసాయ ఉత్పత్తులను పొందడమే కాకుండా ప్రభుత్వం ద్వారా గిట్టుబాటు మార్కెట్ ధరలను పొందే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జీడి, కొబ్బరి రైతులతో పాటు చిరుధాన్యాలను, పప్పు ధాన్యాలు, నూనె గింజలను పండిస్తున్న చిన్న, సన్న కారు రైతులు తప్పనిసరిగా ఈ రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యులుగా చేరాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి మెట్ట శారద, కార్యదర్శి శైలజ, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, డేటాఎంట్రీ ఆపరేటర్ రాజారాం, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అధికారులు

డొంకూరులో విద్యుత్ పనులు

ఇచ్ఛాపురం: జనసేన నాయకులు చీకటి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్జపాడు పంచాయతీ డొంకూరులో విద్యుత్ పనులు బుధవారం చేపట్టారు. పాడైన విద్యుత్ స్తంభాలు, వైర్లను సరిచేశారు. విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.విఘ్నేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నిరంజన్, అసిస్టెంట్ ఇంజినీర్ కె.గోవిందరావు పర్యవేక్షించారు. ఎంపిటిసి మాజీ సభ్యులు, టిడిపి నాయకులు దున్న లోకనాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

శ్రీకాకుళం సిటీ: ప్రతి వ్యక్తి హక్కులతో పాటు సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మెప్మా కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి జీవన విధానంలో మానవ హక్కులు అవసరమన్నారు. మానవ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మానవ హక్కులపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ ఎన్.వెంకటరమణ, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్స్ ఇంటర్నేషనల్ జగన్నాథం నాయుడు, కృష్ణమోహన్, మజ్జి సుమన్, ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ప్రపంచ మానవ హక్కుల అవసరం, ఆవశ్యకత ప్రతి వ్యక్తి గౌరవం, సమానత్వం, స్వేచ్ఛను రక్షించడంలో ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.చిన్నారావు, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి పి.జమున, అకడమిక్ కోఆర్డినేటర్ కె.మౌనిక, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం హేమారావు

నేటి నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ అంతర పాఠశాల బాలబాలికల ఆటల పోటీలు నిర్వమిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి ఆట స్థలాన్ని బుధవారం పరిశీలించారు. గురువారం బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ అలాగే బాలురకు అథ్లెటిక్స్ సీనియర్, జూనియర్ విభాగంలో ఆటలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం బాలురకు గేమ్స్, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అథ్లెటిక్స్‌కు ఇంకా నమోదు చేసుకోని వాళ్ల ఎమ్మెస్వోలకు పాఠశాల వారీగా వివరాలు తెలియజేయాలని కోరారు.

ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

కరాటేలో ప్రతిభ

టెక్కలి : టెక్కలి సత్య ఆర్షల్ మార్స్ కరాటే కోచింగ్ శిక్షణా కేంద్రానికి చెందిన నిర్వాహకులు సత్యతో పాటు మరికొంతమంది ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని నిర్వాహకులు అంగలూరు సత్య బుదవారం తెలిపారు. తెలాంగాణా రాష్ట్రం ఖమ్మంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్న తమ శిక్షణా కేంద్రానికి చెందిన సత్యతో పాటు ఉర్జాన దుర్గాప్రసాద్, అంగలూరు రేష్మ, దేవాది ప్రవలేష్, వాడపల్లి చరణ్‌రాజ్‌లు ప్రతిభ కనబరిచి సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్‌లు అందుకున్నారని తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరచడంపై అభినందించారు.

మాట్లాడుతున్న ఎపిఎం గోవిందరావు

గ్రామస్థాయి నుంచి మార్పు రావాలి

ప్రజాశక్తి- కవిటి

ప్రతి మహిళా జీవితంలో 'వెలుగు'లు నింపేలా గ్రామస్థాయి నుంచి మార్పు రావాలని, దానికి ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలు ఉపయోగించుకోవాలని ఎపిఎం గోవిందరావు సూచించారు. మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనంలో మహిళా సమైక్య సభ్యులు, సిఎఫ్‌లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో మహిళా సంఘం సభ్యులకు చేరవేసి గ్రామస్థాయి నుంచి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణలో సిసిలు, మహిళా సంఘ సభ్యులు, సిఎఫ్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చెల్లింపుల్లో ఆలస్యం వద్దు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులో ఆలస్యం చేయరాదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రైస్ మిల్లర్ల సంఘం సభ్యులు, సివిల్ సప్లయి అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, చెల్లింపులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన విలువ అందేలా వ్యవస్థ పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న ఆయన, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని హెచ్చరించారు. రైతుల సంక్షేమానికి తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ కఠినంగా అమలు చేస్తామన్నారు. సమావేశంలో రైస్‌మిల్లర్ అసోసియేషన్ కిల్లంశెట్టి హరినాథ్, తంగుడు రమేష్, విజయ్, వెంకటరావు సివిల్ సప్లయి అధికారులు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నేత్ర ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని దేవునల్తాడ సచివాలయంలో ఉద్దానం అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యాన శంకర్ పౌండేషన్ వైద్య బృందం బుధవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేత్రాలు ఆరోగ్యం దెబ్బతింటే సర్వం శూన్యమన్నారు. కంటి చూపు మెరుగుపడేలా విటమిన్స్ పుష్కలంగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. శిబిరంలో నేత్ర వైద్యాధికారి కావ్య, పారా మెడికల్ అధికారి మల్లికార్జున, వనజాక్షి సేవలు

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అందించారు. ఈ మేరకు 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 20 మందిని నేత్ర శాస్త్ర చికిత్స కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తులే అప్పోజి, విజయ్, పంచాయతీ కార్యదర్శి కామరాజు, మండల మహేష్, దండుపాటి పవన్‌కుమార్, బొడ్డు బాబాబూరావు, మండల ఈశ్వర్, పరపతి పద్మనాభం, లక్ష్మణ్, గణగళ్ల ఉమా, బొడ్డు రజిని, చింత దివ్య, తామాడ ఊహ పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

బూర్జ : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొవాలన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

కవిటి: బడుగు, బలహీన తరగతులను ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం అందించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దివానిపాలెం, ఎం.ఎస్.పల్లి, లొద్దపుట్టుగ గ్రామాలకు చెందిన వారికి సుమారు రూ.14 లక్షల విలువైన చెక్కులు అందించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- అరసవల్లి

పర్యావరణ అవగాహనను పెంపొందించడమే సిక్కోలు హరిత మహోత్సవమని వైద్యులు కూర్మాన వినోద్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం అసోసియేషన్ అఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యాన సిక్కోలు హరిత మహోత్సవంలో రెండో రోజు బుధవారం పాఠశాల స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. స్టాల్స్‌లో మిల్లెట్ ఫుడ్, టెర్రస్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్స్, కంప్రెస్డ్ ఆయిల్స్, హ్యాండ్లూమ్స్, ఇత్తడి వస్తువులు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, హోమ్‌మేడ్ ఆర్గానిక్ ఫుడ్స్ వంటి విభిన్న విభాగాలు ప్రదర్శించారు. పర్యావరణం,

పాల్గొన్న నిర్వాహకులు

ఆరోగ్యం, సహజ జీవన విధానాల ప్రోత్సాహానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్ ఎన్.విజయ్‌కుమార్, సెక్రటరీ దార్లపూడి రవి, కో చైర్మన్ నటుకుల మోహన్, గీతాశ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ డాక్టర్ వందాన. సచిత్ర, శాప్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలసలో ఏర్పాటు చేయనున్న ఎత్తిపోతల పథకానికి స్థలాన్ని ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని ముంగెన చెరువు మధ్య భాగం వంశధార కుడి ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంత రైతులకు చెందిన సుమారు వంద ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఈ విషయాన్ని ఎంపిటిసి మాజీ సభ్యులు తాడేల వెంకటరమణ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి ఎత్తిపోతల నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ జెఇ అనిల్‌కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇ మాట్లాడుతూ వంశధార కుడి కాలువ నుంచి రొట్టవలస, తిమిరిబంధకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించడానికి సుమారు రెండు

పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కిలోమీటర్లు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామన్నారు. అనుమతులు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు టి.మల్లేశ్వరరావు, గోవిందరావు, రమణ, రాజారావు, సత్యనారాయణ నాయుడు, వైకుంఠరావు పాల్గొన్నారు.

'భూమాత రక్షణ'పై అవగాహన

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని ముండలలో బుధవారం స్థానిక ఎఒ కె.సురేష్ ఆధ్వర్యాన భూ మాత రక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ మాత రక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ ముఖ్య ఉద్దేశం, కమిటీ విధులు గురించి వివరించారు. రైతులను వారి పొలాల నేల పరిస్థితులను మెరుగుపర్చడానికి రసాయన

అవగాహన కల్పిస్తున్న ఎఒ సురేష్

ఎరువులను విజయవతంగా ఉపయోగించేలా ప్రోత్సహించడం, మట్టి నమూనాల ప్రాప్తికి నేలలోని సూక్ష్మ పోషకాల లోపాన్ని పరిష్కరించడం గురించి తెలియజేశారు. నేల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన ఎరువులను మాత్రమే ఉపయోగించమని రైతులకు సూచించారు. నకిలీ ఎరువుల పంపిణీపై నిఘా ఉంచడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే నష్టాలు, పంట వ్యర్థాలు ఉపయోగించుకోవడంతో వచ్చే లాభాలు గురించి తెలియజేశారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రబి లో ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్‌ను గెలిపించాలి

ప్రజాశక్తి- పలాస

ఎపి ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలో ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేస్తున్న కోలా శ్రావణ్‌కుమార్‌ను గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనెల గోపాల్ కోరారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో బుధవారం ఎపి ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి ఫార్మసీ రంగంలో పనిచేస్తున్న వివిధ రంగాల వ్యక్తులు సమూహంగా యునైటెడ్ రిజిస్టర్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ పానెల్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల అందర్నీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. మన హక్కులు పరిరక్షణకు బలోపేతం చేయడానికి మన పానల్లో ఉన్న వ్యక్తులకు ఓట్లు వేయాలన్నారు. జిల్లా ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి డ్రగ్ స్టోర్, అర్బన్ హెల్త్ సెంటర్స్‌ల్లోని ఫార్మసిస్టులందరినీ కలిసి ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకునే పద్ధతిని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెజేటీ సుబ్రహ్మణ్యం, ఆర్గనైజర్ సెక్రటరీ ఎల్.రామారావు, గుంట సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ. విజయమోహన్, ధనుంజయ, తులసి, విజయలక్ష్మి, భవాని వెంకటరమణ, విధాన పరిషత్తు రామచంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను అందజేస్తున్న శ్రావణ్‌కుమార్

ప్రకృతి ఉత్పత్తులే దివ్య ఔషధం

స్టాల్‌లో ప్రకృతి వ్యవసాయ వస్తువులు విక్రయిస్తున్న సిబ్బంది

డిపిఎం పూజారి సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజక్టు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. నగరంలోని పట్టణం 80 ఫీట్ రోడ్‌లోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిక్కోలు హరిత మహోత్సవంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ విభాగం తరపున వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. డిపిఎం మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉందని, వీటిని అదనపు ధరతో వినియోగదారుల విక్రయించాస్తామని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయరావు, సిబ్బంది శ్రీనివాస్, శివాజీ, శోభన్, శ్రావ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

ఆమదాలవలస: కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని లెప్రసీ కాలనీలో అన్నార్తులకు ఆహారాన్ని చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) బుధవారం పంపిణీ చేశారు. కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ నవ్య దంపతుల కుమార్తె ధనిష్క జన్మదినం సందర్భంగా 40 మంది వృద్ధులు, వికలాంగులు, అనాథలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఏటా ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరాలు, ఆహార పంపిణీలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సువ్వారి రవిబాబు, భైరి రాము, లింగుబేరి ఆనంద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంకలో బీజామృతం తయారీపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, ఆవుమూత్రం, నీరు ఉపయోగించి బీజామృతం సిద్ధం చేసే విధానాన్ని డిఎంఎంటి తులసయ్య వివరించారు. విత్తన శుద్ధి, నారు శుద్ధి చేసుకునే ముందు కొద్దిగా సున్నం కలిపి బీజామృతాన్ని వాడుకోవచ్చని తెలిపారు. దీనికి నిల్వ సామర్థ్యం లేకపోయినా విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లను, పొలంలో వ్యాపించే రోగాలను నివారించడంలో ఇది ఉపయోగకరమని పేర్కొన్నారు. కేవలం వరి పంటకు మాత్రమే కాకుండా కాయగూరలు, ఆకు కూరల విత్తనాల శుద్ధికి బీజామృతం సమర్థవంతంగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి ధనలక్ష్మి, లత, శ్రీధర్, రైతులు బల్లెడ జయప్రకాష్, బల్లెడ బాబూరావు, బడ్డ మన్మథరావు, బి.రాజారత్నం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి చిరంజీవి

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఎస్.ఎం.పురం పంచాయతీ సాయి నగర్ కాలనీలో 12 అడుగుల సిసి రోడ్ల పనులను ఎంపిపి మొదలవలస చిరంజీవి బుధవారం ప్రారంభించారు. ఈ రోడ్డుకు అవసరమైన మెటీరియల్, నాణ్యత తగ్గకుండా పని చేపట్టాలని సూచించారు. ఇటీవల పంచాయతీ పరిధిలో లింగాలపేట సమీపంలో ఎన్నో చక్కటి రోడ్డు నిర్మించి మంచి పేరు తెచ్చారని అభినందించారు. ప్రజలకు సేవ చేయడానికి ప్రజా ప్రతినిధులు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఎం.పురం ఎంపిటిసి కూన ఈశ్వరమ్మ, ఎంపిటిసి ప్రతినిధి కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆడిటర్స్ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఆమదాలవలసకు చెందిన బుడుమూరు శ్రీశీనివాసరావు ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర టాక్స్ ప్రాక్టీషనర్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ గుంటూరు సంఘ అధ్యక్షునిగా కూడా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు అసోసియేషన్‌కు అధ్యక్షునిగా పనిచేసిన దామల్చర్ల శ్రీనివాసరావు రేరా సభ్యుడిగా నియమితులవడంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బుడుమూరు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం మల్లన్న దేవస్థాన ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ట్రస్టు బోర్డు చైర్మన్ టి.రమేష్ నాయుడు, ఇఒ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

కొత్తూరు : ఇండియన్ గ్యాస్ కార్యాలయం వద్ద మండలంలోని కర్లమ్మ పంచాయతీ బడిగం గ్రామస్తులకు బుధవారం కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లు, స్టౌవ్‌లు వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బోర శ్రీరాములు, పడాల వెంకటకృష్ణ, కొయిలాపు సంజీవరావు, సవర పాల్గుణరావు, బూరాడ మలహాసన్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న తులసీవరప్రసాదరావు